# అభ్యర్థుల మార్కులు అంతర్జాలంలో..

దిల్లీ: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా కేంద్రం కీలక ముందడుగు వేసింది. ప్రభుత్వ పోటీ పరీక్షల్లో అభ్యర్థులు సాధించే మార్కులను అంతర్జాలంలో అందరికీ అందుబాటులో ఉంచాలంటూ నీతి ఆయోగ్ చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. తద్వారా ప్రైవేటురంగ సంస్థలూ సంబంధిత జాబితాలోని ప్రతిభావంతులను ఉద్యోగులుగా ఎంపిక చేసుకునేందుకు వీలు కలగనున్నట్లు సిబ్బంది, శిక్షణశాఖ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. అభ్యర్థుల మార్కులు, ఇతర వివరాలు వెల్లడించేందుకు 'జాతీయ సమాచార నిధి(ఎన్ఐసీ)' ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించనుంది. వివిధ నియామక సంస్థలతో ఇది అనుసంధానమై ఉంటుంది. అభ్యర్థుల విభాగం(జనరల్/ఎస్సీ/మైనారిటీ వంటి వివరాలు), విద్యార్హతలు, ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, చిరునామా తదితర వివరాలు అందుబాటులో ఉంటాయి. పోటీపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ మార్కుల వివరాలు బహిరంగా వెల్లడించకుండా ఉండాలని భావిస్తే... దరఖాస్తు సమయంలోనే సంబంధిత ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతిభావంతులైన ఉద్యోగులను ఎంపిక చేసుకునేందుకు ప్రైవేటు యాజమాన్య సంస్థలకూ అవకాశం కల్పించేలా పోటీపరీక్షల మార్కుల వివరాలను అంతర్జాలంలో అందుబాటులో ఉంచుతామని ప్రధాని మార్చిలో ప్రకటించిన సంగతి గమనార్హం.